క్లుప్తంగా

లోక్అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారానికి కృషి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు



రేపల్లె రూరల్: పెండింగ్ కేసుల పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న లోక్అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారం అయ్యేలా అధికారులు పని చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక కోర్టు హాలులో పోలీసు, రెవెన్యూ, బ్యాంక్ తదితర శాఖల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. మార్చి 8వ తేదీన లోక్అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ఆయాశాఖల అధికారులు పనిచేయాలని చెప్పారు. సమావేశంలో న్యాయవాదులు పీఎస్‌బీ శర్మ, కె.నాగాంజనేయులు, ఎస్‌బీఐ బజార్ బ్రాంచ్ మేనేజర్ కుమార్ పాల్గొన్నారు.

పన్నులను మున్సిపల్ కార్యాలయంలోనే చెల్లించాలి

రేపల్లె రూరల్: మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజులు, ఇతర పన్నులు మున్సిపల్ కార్యాలయంలో చెల్లించి తప్పనిసరిగా రశీదులు పొందాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు చెప్పారు. స్థానిక కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. పలువురు సైబర్ నేరగాళ్లు మున్సిపల్ కార్యాలయం పేరుతో ఫోన్ చేసి ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయా ఫోన్ నంబర్లను పరిశీలించగా ఫేక్ నంబర్లుగా గుర్తించినట్లు చెప్పారు. వ్యాపారులు, ఇతర పట్టణ ప్రజలు ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించరాదని సూచించారు. మున్సిపల్ కార్యాలయం పేరుతో వచ్చే ఫోన్‌లను నమ్మరాదని, తప్పనిసరిగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చి చెల్లించిన బిల్లులకు రశీదులు పొందాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



బాపట్ల: మండలంలోని ఈస్ట్‌బాపట్ల గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. శనివారం గ్రామ పంచాయతీలో దుస్తులు, కొబ్బరినూనె, చెప్పులను కార్యదర్శి పల్నాటి శ్రీరాములు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకంగా ఉంటుందని తెలిపారు.

ఒకేషనల్ కోర్సులో అసెస్మెంట్ పరీక్ష

అమృతలూరు(వేమూరు): పదో తరగతి, సీనియర్ ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులో శిక్షణ ఇచ్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనపర్తి నిరీక్షణరావు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు బాపట్ల జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ, అసెస్మెంట్ ఎగ్జామినర్ రుబియ సుల్తానా పర్యవేక్షించారు.

అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు



జంపని(వేమూరు): పోషణ భీ.. పడాయి భీ కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ పిల్లలకు నాణ్యతమైన పౌష్టికాహారం అందిండం జరుగుతుందని సీడీపీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భవిత పాఠశాల ఉపాధ్యాయులు మోహనరావు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు కె.మాధవి, వి.అమృతవాణి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఆర్డీఓ రామలక్ష్మి



రేపల్లెలో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న రేపల్లె ఆర్డీఓ నేలపు రామలక్ష్మి

రేపల్లె రూరల్: స్వచ్ఛ రేపల్లె సాధన దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని ఆర్డీఓ నేలపు రామలక్ష్మి అన్నారు. స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వివిధ పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ స్వచ్ఛతతో కూడిన సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్ల నుంచి గాని, పచారీ, కూరగాయల దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బందికి గాని, నిర్ణీత ప్రదేశాలలోగాని పడవేయాలన్నారు. మానవ తప్పిదాలతో చోటు చేసుకుంటున్న వాతావరణ మార్పులతో పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అనంతరం రాజ్యలక్ష్మి థియేటర్ రహదారిలో విద్యార్థులతో మానవహారం నిర్వహించి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన ఉండాలి

చెరుకుపల్లి: విద్యార్థి దశ నుంచే స్వచ్ఛతపై అవగాహన ఉండాలని తహసీల్దార్ సిహెచ్.పద్మావతి తెలిపారు. మండల కేంద్రమైన చెరుకుపల్లి జెడ్పీ హైస్కూలులో స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

రేపల్లె రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఆర్.దివాకర్ అన్నారు. స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో..

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్రకుమార్ చేయించారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంతో కలిగే ప్రయోజనాలు, చెత్త నిర్వహణ పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.బాలగురవయ్య, స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కమిటీ సభ్యుడు ఎం.బుజ్జిబాబు, ఏక్యూఏసీ కోఆర్డినేటర్ నర్సయ్య, జూనియర్ అసిస్టెంట్ ప్రసన్నకుమార్, కళాశాల స్కిల్ హబ్ సమన్వయకర్త బి.కోటేశ్వరరావు, కోఆర్డినేటర్ రవికుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన డీపీఓ ప్రభాకర్‌రావు

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం

యాజలి(కర్లపాలెం): పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని బాపట్ల డీపీఓ కేఎల్ ప్రభాకర్‌రావు చెప్పారు. యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దమ్మనవారిపాలెం సంపద సృష్టి కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యాజలి హైస్కూల్‌లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా డీపీఓ విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ మనిషికి పౌష్టికాహారం ఎంత ముఖ్యమో పరిశుభ్రత కూడా అంతే ముఖ్యమని చెప్పారు. విద్యార్థులు మరుగుదొడ్లను వినియోగించుకోవాలన్నారు. పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. దమ్మనవారిపాలెం సంపద సృష్టి కేంద్రాన్ని జిల్లాలోనే మోడల్ కేంద్రంగా అన్ని పంచాయతీలకు ఆదర్శంగా తీర్చి దిద్దాలని సచివాలయం సిబ్బందికి చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, యాజలి హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు, కార్యదర్శులు వీరాస్వామిరెడ్డి షకీనాసుల్తానాబేగం, తిరుమలరెడ్డి ఉన్నారు.

అవయవదానంతో మృత్యుంజయులు కండి

జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి



మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టరు రమణ యశస్వి

బాపట్ల: అవయవ దానం ద్వారా మృత్యువును జయించవచ్చు అని గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టరు రమణ యశస్వి పేర్కొన్నారు. ప్రకృతి సూత్రాన్ని అందిపుచ్చుకొని, మానవులు అవయవ దానం చేసి మరణించిన తర్వాత కూడా జీవించాలని అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, డాక్టర్ రమణ యశస్వి పిలుపునిచ్చారు. శనివారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఆయన డాక్టర్ వైఎస్ కృష్ణమూర్తి స్మారక ఉపన్యాసం చేశారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టరు రమణ మాట్లాడుతూ దేహదానం వైద్యరంగంలో పరిశోధనలకు ఊతమిస్తుందని, నూతన ఆవిష్కరణలకు దారితీస్తుందని అన్నారు. ఎందరో అభాగ్యులు అవయవదానం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారని వివరించారు. అవయవదానం మన సామాజిక బాధ్యత అని ఆయన చెప్పారు. ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డబ్ల్యూజీకే మూర్తి మాట్లాడుతూ డాక్టర్ కృష్ణమూర్తి విద్య, వైద్య రంగాల్లో బాపట్లకు విశేషమైన సేవలందించారన్నారు. బాపట్లను విద్యా కేంద్రంగా తీర్చిదించడానికి పటిష్టమైన పునాదులు వేశారని చెప్పారు. కార్యక్రమంలో ఇంకా బాపట్ల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టరు కె.సిద్ధార్థ, గుంటూరు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ తాతా సేవా కుమార్, పీఎస్‌కే విద్యాసంస్థల చైర్మన్ పెరలి సునీల్ కుమార్ ప్రసంగించారు. సభకు ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.శ్రీహరిరావు, రిటైర్డు అధ్యాపకులు గోరంట్ల శాంతరామ్, జి.వి.సుబ్రహ్మణ్యం, గురజాల శ్రీనివాసరావు, చిత్రకారుడు జీవీ ప్రసన్నాంజనేయులు, వాసుదేవరావు, ఇక్కుర్తి శ్రీనివాస్, కరణం రవీంద్ర, పువ్వాడ బసంత్ కుమార్, తులసి చంద్రశేఖర్, సత్యనారాయణ, చినభూషణం పాల్గొన్నారు.

సిలబస్‌ను పూర్తి చేసేందుకు కృషి చేయాలి

డీఈఓ పురుషోత్తం



మాట్లాడుతున్న డీఈఓ

బాపట్ల: సిలబస్‌ను పూర్తి చేసేందుకు ఉపాధ్యాయులు చొరవ తీసుకునే విధంగా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ ఎస్.పురుషోత్తం పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని కొండభొట్లవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన క్లస్టర్ సమావేశం శనివారం నిర్వహించారు. డీఈఓ పురుషోత్తం మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సబ్జెక్టు ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలలో బోధిస్తున్న మూడు, నాలుగు ,ఐదు తరగతుల ఉపాధ్యాయులకు, ఒకటి రెండు తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులకు వేర్వేరుగా శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్దేశించిన సిలబస్ ఎంతవరకు పూర్తి చేశారు, మిగిలిన సిలబస్ త్వరగా పూర్తి చేసుకునే విధంగా వెనుకబడిన విద్యార్థుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకొని మంచి ఫలితాలు వచ్చే విధంగా ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు కె.రామారావు, సత్యనారాయణ, డి.లక్ష్మీసామ్రాజ్యం, గురజాల శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు, ఉదయ శంకర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అవగాహన

తెనాలిటౌన్: దివ్యాంగ పిల్లలకు స్క్రీనింగ్, ఇంక్లూజన్, రిఫరల్స్, ప్రొటోకాల్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం స్థానిక కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పోషణ్‌బీ పడాయీబీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడురోజులపాటు శిక్షణ తరగతులను నిర్వహించారు. చివరిరోజైన శనివారం ఏర్పాటైన సమావేశంలో డాక్టర్ హనోక్ పాల్గొని దివ్యాంగ పిల్లల విషయంలో అంగన్‌వాడీలు పాటించాల్సిన స్క్రీనిగ్, ఇంక్లూజన్, రిఫరల్స్, ప్రొటోకాల్ అంశాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు తెనాలి సీడీపీఓ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ పోషకాహారం లోపం లేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా అంగన్‌వాడీలు పనిచేయాలని సూచించారు. 0–6 సంవత్సర వయసులోని పిల్లలకు ఆహారం అందించే విషయంలో తల్లులకు వివరించాల్సిన సూచనలను తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని పోషణ్‌బీ పడాయీబీ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు ప్రాజెక్టు పరిధిలోని 200 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడురోజులపాటు నాలుగు ప్రదేశాల్లో శిక్షణ తరగతులు జరిపినట్టు చెప్పారు. శిక్షణ తరగతుల్లో సూపర్‌వైజర్లు సీహెచ్ హిమబిందు, నాగమణి, నందుకుమారి, వెంకటలక్ష్మి, వెంకటరమణ, రాధిక, యానాదమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం



మోదుకూరు(వేమూరు): పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం పూర్తిగా ఉండాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు కోరారు. చుండూరు మండలంలోని మోదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు కంప్యూటర్లు శనివారం అందజేశారు. పూర్వ విద్యార్థి నాగేశ్వరరావు రూ.50 వేలతో ఐదు కంప్యూటర్లు, మోపర్రు కోటయ్య కోసం రూ.25 వేల అందించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

వేమూరు: ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని విద్యా వనరుల కార్యాలయంలో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ఉన్నతమైన విద్యను అందించాలని కోరారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

తెనాలిరూరల్: భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు పట్టణ శాలిపేటకు చెందిన రమేష్ తన భార్య జయశ్రీని కొద్ది కాలంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా వన్ టౌన్ పోలీసులు కేసు శనివారం నమోదు చేశారు.

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

కొల్లిపర: వ్యవసాయ రంగాన్ని పూర్తి ఆధునీకరణ(డిజిటలేషన్) చేసే ప్రక్రియలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెలతో విశిష్ట గుర్తింపు సంఖ్య(యూనిక్ ఐడీ) ఆధార్ కార్డు తరహాలో అందించనుందని ఏవో కె.వెంకటరావు అన్నారు. శనివారం మండలంలోని వివిధ రైతు సేవా కేంద్రంలో నమోదు కార్యక్రమం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ భూమి కలిగిన రైతులు ఆధార్ , ప్రభుత్వం ఇచ్చిన పాస్‌పుస్తకం, వన్‌బీ, ఆధార్‌తో లింకు కలిగిన ఫోన్ పట్టుకుని దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ సిబ్బంది కి అందిస్తే వెంటనే ఆన్‌లైన్ లో నమోదు చేయటం జరుగుతుందని తెలిపారు.

అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి

11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు



న్యాయవాదులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసులు

తెనాలిరూరల్: మార్చి 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు న్యాయవాదులను కోరారు. తెనాలి కోర్టు సముదాయంలో శనివారం న్యాయవాదులతో ఆయన సమావేశమయ్యారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీపడితే కోర్టు ఫీజులు సైతం వాపసు వస్తాయని, కక్షిదారులకు దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. రాజీ అయ్యే వీలున్న కేసులన్నింటిని అదాలత్‌లో పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయంతో పాటు డబ్బులు ఆదా అవుతాయని స్పష్టం చేశారు. అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చొరవ చూపాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, దాసరి శ్రీధర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, తమ పరిసరాలలో అనుమానాస్పద స్థితిలో సంచరించే వారి వివరాలను పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు అన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు రాత్రి పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా రేపల్లె పట్టణంలోని ప్రకాశం మున్సిపల్ స్కూలు ఆవరణలో శుక్రవారం పట్టణ ప్రజలతో మాట్లాడారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరిగిందని, అదే విధంగా సైబర్‌నేరాలు పెరిగాయని హెచ్చరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరం మేరకు మాత్రమే వినియోగించాలని, అవసరం లేని విషయాలలో ఈ పరిజ్ఞానాన్ని వినియోగిస్తే మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

చెరుకుపల్లి: రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందాలంటే ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభానీ తెలిపారు. వ్యవసాయ శాఖ, పంచాయతీ రాజ్, మండల పరిషత్‌శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) ప్రచారాన్ని మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరణ చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను అందిస్తుందన్నారు. సొంత భూమి కలిగిన ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాలు, రాయితీలు పొందాలంటే 14 అంకెల విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని చెప్పారు. ఈ నెల 25వ తేదీలోగా నమోదు చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అవ్వారు మహేష్‌బాబు పాల్గొన్నారు.

పౌష్టికాహర లోపాల నివారణపై దృష్టి సారించాలి



కొల్లూరులో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న ఏసీడీపీఓ

కొల్లూరు: గర్భిణులు, బాలింతలలో పౌష్టికాహార లోపాలను నివారించడంపై అంగన్‌వాడీ కార్యకర్తలు దృష్టి సారించాలని అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీఓ బి.విజయరాణి కోరారు. పోషణ్ భీ–పడాయి భీ శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు కొల్లూరు బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో దోనేపూడి, కొల్లూరు, అనంతవరం, భట్టిప్రోలు మండలం వెల్లటూరు సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ట్రైనింగ్‌లో చివరి రోజైన శనివారం ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహార పదార్థాలను గర్భిణులు, బాలింతలకు సరైన సమయంలో అందజేయడంతోపాటు, వారు వాటిని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు టి.విజయలక్ష్మి, పజరున్నీస, మాణిక్యం పాల్గొన్నారు.

చిన్నారుల మనోవికాసాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

రేపల్లె రూరల్: చిన్నారుల మనోవికాసాభివృద్ధికి అంగన్‌వాడీలు ప్రత్యేక శ్రద్ధ వహించి, ఆట పాటలతో కూడిన విద్యను అందించాలని సీడీపీఓ ఎం.సుచిత్ర అన్నారు. పట్టణంలోని మున్సిపల్ హైస్కూలు, ట్రిబుల్ ఎస్‌హైస్కూలులో రేపల్లె పట్టణ, మండలంలోని అంగన్‌వాడీలకు పోషణ్ భీ పడాయి భీ అంశంపై నిర్వహిస్తున్న శిక్షణాతరగతులు శనివారంతో ముగిశాయి. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు నాంచారమ్మ, శివజ్యోతి, సునీత, నాగలక్ష్మి, మంజుల, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

రొయ్యల చెరువులను అడ్డుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బావాజీ పాలెం గ్రామస్తులు

నిజాంపట్నం: వ్యవసాయ గుంతల పేరుతో తవ్వుతున్న రొయ్యల చెరువులను అడ్డుకోవాలని బావాజీపాలెం గ్రామస్తులు తహసీల్దార్‌కు విన్నవించారు. బావాజీపాలెంలో అక్రమంగా తవ్వుతున్న రొయ్యల చెరువులను నిలుపుదల చేయాలంటూ గ్రామస్తులు శనివారం తహసీల్దార్ షాహిద్‌పాషాకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో కొంత మంది ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద వ్యవసాయ గుంతలని అనుమతులు పొంది రొయ్యల చెరువులు తవ్వుకుని సాగుకు చేపడుతున్నారని ఆరోపించారు. ఆరు సంవత్సరాల క్రితం ఇదే విధంగా వ్యవసాయ గుంతల కోసం తవ్విన ప్రదేశాన్ని రొయ్యల చెరువుగా మలచి సాగు చేసుకున్నారని చెప్పారు. అదే బాటలో పలువురు రొయ్యల చెరువులు తవ్వేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారన్నారు. రొయ్యల చెరువులు తవ్వి ఆక్వా సాగు చేస్తే తమ ప్రాంతంలోని భూగర్భ జలాలు కలుషితం అవ్వటంతో పాటు, పంట భూములు బీడు భూములుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రొయ్యల చెరువుల ఏర్పాటు ప్రక్రియను అడ్డుకోవటంతో పాటు గతంలో తవ్విన రొయ్యల చెరువును మూసివేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎండీ నూరుద్దీన్, ఎంఎస్ అహ్మద్, గౌస్, పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నగరం: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు దాతలు ముందుకురావడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు బదరీ నారయణచెప్పారు. మండలంలోని పెద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శనివారం ప్లేట్‌లు, క్యాలెండర్‌లు పంపిణీ చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ గ్రామంలోని వేదాల రాజ్యాలక్ష్మి ట్రస్ట్ పాఠశాలలోని విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తోందని చెప్పారు. దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు మేజర్ వీఆర్‌కే చారి పాల్గొన్నారు.